క్లుప్తంగా

104 సేవలు సద్వినియోగం చేసుకోండి



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ శ్రావణి

సైదాపురం : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 104 సేవలను సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారిణి డాక్టర్ శ్రావణి కోరారు. మండలంలోని కమ్మవారిపల్లిలో శనివారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించి రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు.

రక్త దానం ప్రాణ దానంతో సమానం



రక్తదానం చేస్తున్న పరిశ్రమ ప్రతినిధులు

చిల్లకూరు : రక్తం దానం చేయడం ద్వారా మరొకరి ప్రాణాలను కాపాడవచ్చని జిందాల్ పవర్ ప్రాజెక్టు (సింహపురి యూనిట్) హెడ్ ఎస్‌ఏ మన్సూరి తెలిపారు. తమ్మినపట్నం సమీపంలో ఉన్న పవర్ ప్రాజెక్టు కార్మికుల సావిత్రి విహార్ కాలనీలో శనివారం తిరుపతి రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్త దాన శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రమాదంలో గాయపడిన వారికి, గర్భిణులకు కాన్పు సమయంలో రక్తం అవసరం అవుతుందన్నారు. ఆ సమయంలో సరైన సమయంలో రక్తం దొరక్కపోతే ప్రాణాపాయ పరిస్థితి తలెత్తుతుందన్నారు. ఈ క్రమంలోనే రక్తదాన శిబిరాల ద్వారా సేకరించిన రక్తాన్ని వారికి అందించేలా రెడ్ క్రాస్ సొసైటీ చేయూతనిస్తోందన్నారు. సుమారు 80 మంది రక్తదానం చేశారు. పరిశ్రమ ప్రతినిధులు విల్సన్, శిశిర్‌నాయక్, మాథ్యూ తదితరులు పాల్గొన్నారు.

మినీ లారీ బోల్తా

దొరవారిసత్రం : ఒంగోలు నుంచి చెన్నైకి మామిడికాయాల లోడుతో వెళుతున్న మినీ లారీ దొరవారిసత్రం వద్ద శనివారం తెల్లవారు జామున రోడ్డులోని డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. డ్రైవర్ సింహాద్రి నిద్రలోకి జారుకోవడంతోనే ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్టు సమాచారం. దీనిపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



సరుకులు అందజేస్తున్న ఎల్లసిరి గోపాల్‌రెడ్డి

గూడూరు రూరల్ : రోటరీ క్లబ్ వారోత్సవాల్లో భాగంగా శనివారం డీఎస్‌ఆర్ కమ్యూనిటీ హాలు ఆడిటోరియంలో వృద్ధులకు నెలకు సరిపడా నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యుడు, సీనియర్ రొటేరియన్ ఎల్లసిరి గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ వృద్ధులకు నిత్యావసర వస్తువులు అందజేసిన సేగు శ్రీనివాసులును అభినందించారు. క్లబ్ అధ్యక్షుడు సనత్‌కుమార్‌రెడ్డి, ఆడిటర్ రామ్మోహన్‌రావు, సేగు శ్రీనివాసులు, వాసుగౌడ్, ధనుంజయరెడ్డి, నాసిన నాగులు, తాళ్లూరు శ్రీనివాసులు, బాబు, సుబ్రమణ్యం, కృష్ణంరాజు, రవీంద్రరెడ్డి పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు



సైదాపురం: వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

సైదాపురం: నెలకు ఒక్క రోజు గర్భిణులకు అన్ని వైద్య పరీక్షలు చేస్తున్నట్టు వైద్యాధికారిణి డాక్టర్ శ్రావణి తెలిపారు. ఆమె శనివారం స్థానిక పీహెచ్‌సీలో ప్రధానమంత్రి మాతృత్వ వందన, అభియాన్ కింద గర్భిణులకు ప్రత్యేక వైద్య పరీక్షలు చేశారు. సుమారు 35 మందికి పైగా గర్భిణులు పరీక్షలు చేయించుకున్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం అందజేత

గూడూరు రూరల్ : స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో శనివారం గర్భిణులకు జేవీవీ ఆధ్వర్యంలో వీఎస్‌ఆర్ స్కూల్ కరస్పాండెంట్ బాల కృష్ణంరాజు దాతృత్వంతో పౌష్టికాహారం అందజేశారు. డాక్టర్ రాజా మాట్లాడుతూ 9 ఏళ్లుగా జేవీవీ ఆధ్వర్యంలో గర్భిణులకు పౌష్టికాహారం అందజేయడం అభినందనీయమన్నారు. జేవీవీ ప్రతినిధులు నాగరాజు, పురుషోత్తమరావు, అశోక్, రాధయ్య, జగదీష్, ప్రభాకర్, విష్ణు, ఇబ్రహీం, శ్రీను, ఆనంద్, సుబ్బారావు, సాయి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



గూడూరు రూరల్: కోర్టు సెంటర్‌లోని రైల్వే స్టేషన్ వద్ద 40 ఏళ్లున్న వ్యక్తి మృతిచెంది ఉండడాన్ని శనివారం పోలీసులు గుర్తించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లేవు. మృతదేహాన్ని గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ సుబ్రమణ్యంరాజు తెలిపారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- తిరుపతి ఎంపీ గురుమూర్తి
- చిట్టమూరులో హెల్త్ క్లినిక్ ప్రారంభం,
- చిల్లకూరులో రక్షిత నీటి పథకానికి శంకుస్థాపన



వరగలిలో తాగునీటి పథకానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీ గురుమూర్తి, ప్రజాప్రతినిధులు



చిట్టమూరులో వైఎస్సార్ హెల్త్ కినిక్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ గురుమూర్తి, కలెక్టర్ లక్ష్మీశ

చిల్లకూరు : అభివృద్ధి, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం, ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నట్టు తిరుపతి ఎంపీ గురుమూర్తి తెలిపారు. ఆయన శనివారం ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, కలెక్టర్ లక్ష్మీశతో కలిసి చిట్టమూరు మండలం బురదగాలికొత్తపాళెంలో రూ.17.50 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్, చిల్లకూరు మండలం వరగలిలో రూ.35 లక్షలతో మంచినీటి పథకానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఎంపీ గురుమూర్తి మాట్లాడారు. సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి పనిచేస్తున్నారని తెలిపారు. గ్రామాల్లో సచివాలయాలు, హెల్త్ క్లినిక్‌లు, ఆర్బీకేలు, పశువైద్య కేంద్రాలను అందుబాటులోకి తీసుకువచ్చి బాపూజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని తీసుకువచ్చారని గుర్తు చేశారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందించి ఆర్థికంగా అభివృద్ధి చెందేలా చర్యలు తీసుకున్నారని తెలిపారు. జిల్లా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ వర్షాభావం వల్ల రైతులు సాగు నీటికి ఇబ్బందులు పడతుండడంతో సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఉత్తర్వుల మేరకు తెలుగుగంగ నీటిని విడుదల చేశామన్నారు. ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ మాట్లాడుతూ ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమానికి అనేక చర్యలు తీసుకుంటోందన్నారు. చేపల వేట విరామ సమయంలో ఇబ్బందులు పడకుండా ఆర్థికంగా చేయూత ఇస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా పల్లెవానిదిబ్బ, లింగవరం, వరగలి గ్రామస్తులు తమ సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు. వరగలిలోని బీసీ వసతి గృహాన్ని మినీ గురుకులంగా మార్చేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం తెలుగుగంగ కాలువల ద్వారా నీటిని అందించినందుకు మల్లాం సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయం వద్ద వైఎస్సార్ సీపీ నాయకుడు దువ్వూరు శేషరెడ్డి ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు, అధికారులను సన్మానించారు. కార్యక్రమంలో నెల్లూరు జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, జెడ్పీటీసీ మన్నెం శ్రీనివాసులు, పార్టీ మండల కన్వీనర్ యద్దల మధుసూదన్‌రెడ్డి, నాయకులు యరటపల్లి జానకిరామిరెడ్డి, మండల ఉపాధ్యక్షులు వేమారెడ్డి కుమారస్వామిరెడ్డి, చెంగయ్య, నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, చంద్రారెడ్డి, కిరణ్‌రెడ్డి, సర్పంచ్‌లు నాశిన సుబ్రమణ్యం, మాధవి, తహసీల్దార్ శ్రీనివాసులు, డీఈ నందకుమార్, హేమంత్ పాల్గొన్నారు.

పార్టీ విజయం కోసం పనిచేయాలి



మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి

- నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి
- కార్యకర్తలతో విస్తృత స్థాయి సమావేశం

కలువాయి: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం సాధించి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోమారు ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ప్రతి కార్యకర్తా సైనికుడిలా పనిచేయాలని ఆ పార్టీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆయన శనివారం కలువాయిలో పార్టీ నాయకులు, కార్యకర్తల విస్తృత సమావేశంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పాలనను అందిస్తున్నారని తెలిపారు. ఆయన ప్రజలకు చేసిన మేలును ప్రతి ఇంటికీ వెళ్లి వివరించాలన్నారు. వారి సమస్యలు తెలుసుకునేందుకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని అమలుచేసినట్టు తెలిపారు. ప్రజలకు ప్రభుత్వం మేలు చేసి ఉంటేనే మరోమారు మమ్మల్ని ఆశీర్వదించాలని చెప్పగలిగే దమ్మున్న ఏకైక నాయకుడు జగన్‌మోహన్ రెడ్డి అని పేర్కొన్నారు. ఈ ప్రభుత్వ పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారని తెలిపారు. ఈ విషయం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో స్పష్టమైందని వివరించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం చేసిన మేలును వివరించి ఫ్యాను గుర్తుకు ఓటు వేసేలా చూడాలన్నారు. పార్టీ కోసం కష్టపడే వారికి గుర్తింపు ఉంటుందని హామీ ఇచ్చారు. వెంకటగిరి నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీని అత్యధిక మెజారిటీతో గెలిపించి ముఖ్యమంత్రికి కానుకగా ఇద్దామని పిలుపునిచ్చారు. అనంతరం మండలంలోని అన్ని పంచాయతీల నాయకులు, కార్యకర్తలతో విడివిడిగా సమావేశమై పార్టీ పటిష్టతకు అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చలు జరిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బి.అనిల్‌కుమార్ రెడ్డి, మండల అధ్యక్షురాలు ఆర్.లక్ష్మీదేవి, ఉపాధ్యక్షులు పంగా పెంచలనరసారెడ్డి, సొసైటీ చైర్మన్ చల్లా సుబ్బరామిరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ ఎంపీ కృష్ణారెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు

వైఎస్సార్ ఆసరా, చేయూతతో మహిళల ఆర్థికాభివృద్ధి



మహిళలకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సంజీవయ్య తదితరులు

- ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య
- మహిళలకు వైఎస్సార్ చేయూత చెక్కు పంపిణీ

దొరవారిసత్రం : వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూతతో మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందారని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తెలిపారు. ఆయన శనివారం స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయం వద్ద మండలంలోని పొదుపు సంఘాల మహిళలకు నాలుగో విడత వైఎస్సార్ చేయూత కింద రూ.4.56 కోట్లు చెక్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ జగనన్న 2019లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చారని తెలిపారు. మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలనే ఉద్దేశంతో పలు పథకాలు అమలుచేసినట్టు తెలిపారు. ఇవన్నీ యధావిధిగా కొనసాగాలంటే మళ్లీ జగనన్నకే పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. అంతేకాకుండా మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఏపీఎం పద్మావతి, సంఘ అధ్యక్షురాలు భాతరి, పలువురు మహిళా సర్పంచులను సన్మానించారు. కార్యక్రమంలో సూళ్లూరుపేట చెంగాళ్లమ్మ ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ దువ్వూరు గోపాల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ గోపాల్‌రెడ్డి, మండల కన్వీనర్ శ్రీనివాసులురెడ్డి, సీసీ మురళి, జెడ్పీటీసీ రమేష్, నాయకులు రమణారెడ్డి, సురేష్‌రెడ్డి, రాజగోపాల్, రామయ్య, మధురెడ్డి, గోపిరెడ్డి పాల్గొన్నారు.

మహిళలను లక్షాధికారులను చేయడమే జగనన్న ధ్యేయం

నాయుడుపేట టౌన్ : మహిళలను లక్షాధికారులుగా చేయడమే సీఎం జగనన్న ధ్యేయమని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తెలిపారు. స్థానిక కేకే కల్యాణ్ సదన్‌లో శనివారం సాయంత్రం మున్సిపల్ చైర్ పర్సన్ కటకం దీపిక అధ్యక్షతన చేయూత నాలుగో విడత సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు రూ.3.28 కోట్ల చెక్కు అందజేశారు. ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని ఆదరించి జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. అనంతరం మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా ప్రజా ప్రతినిధులు, మహిళా అధికారులను సత్కరించారు. సీఎం వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రేమ్‌రాజ్ కుమార్, ఏపీఎం ప్రసన్నకుమారి, జేసీఎస్ కన్వీనర్లు చదలవాడ కుమార్, కిషోర్ యాదవ్, కటకం జయరామయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ జలదంకి వెంకటకృష్ణారెడ్డి, నాయకులు కోండురు రామకృష్ణం రాజు, జీ సిద్దయ్య, దార రవి, పీ నాగార్జున, షేక్ షబ్బీర్ పాల్గొన్నారు.



సీఎం చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

పీఆర్ ఉద్యోగుల సంఘం నాయకుడికి సన్మానం



దేవప్రసన్నకుమార్‌ను సత్కరిస్తున్న నాయకులు

నాయుడుపేట టౌన్ : నాయుడుపేటకు చెందిన వి.దేవ ప్రసన్నకుమార్ ఏపీ పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నెల్లూరు జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయనను శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. రాష్ట్ర ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, జిల్లా అధ్యక్షుడు దేవ జశ్వంత్, బందిలి శేఖర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా మహా నవావరణ హోమం



హోమం చేస్తున్న వేద పండితులు

గూడూరు రూరల్ : గూడూరు పట్టణంలోని పటేల్ వీధిలో ఉన్న శ్రీసాయి సత్సంగ నిలయం విజయ దుర్గ ఉప పీఠంలో శనివారం అమావాస్య తిథిని పురస్కరించుకుని మహా నవావరణ హోమం నిర్వహించారు. సర్వశత్రుబాధ నివారణం, సర్వ రుణ బాధ నివారణం, ఆర్థిక, శారీరక, మానసిక సర్వ సంక్షోభ నివారణ కోసం మహా నివారణ హోమం నిర్వహించినట్టు కోట సునీల్‌కుమార్ స్వామి తెలిపారు.

ఏఎన్‌ఎం కామేశ్వరికి అవార్డు



వాకాడు: మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం వాకాడు మండలం బాలిరెడ్డిపాళెం గ్రామ సచివాలయ ఏఎన్‌ఎం కామేశ్వరి ఉమెన్ ఐకాన్ గ్లోబల్ అవార్డు అందుకున్నారు. ఆమె ప్రజలకు చేసిన సేవలను గుర్తించి ముంబయికి చెందిన సహారా చారిటబుల్ ట్రస్టు ఈ అవార్డు అందజేసింది. ఆమెను మండలంలోని పలువురు అభినందించారు.

కల్యాణం.. కమనీయం



నాయుడుపేట టౌన్ : కాశీవిశ్వేశ్వరస్వామి కల్యాణం చేస్తున్న వేదపండితులు



వెంకటగిరి : శివపార్వతుల గ్రామోత్సవం

నాయుడుపేట టౌన్ : మహాశివ రాత్రి వేడుకల్లో భాగంగా బ్రాహ్మణ వీధిలోని అన్న పూర్ణేశ్వరీదేవి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. అన్న పూర్ణాదేవి ట్రస్టు సభ్యులు ఉభయదాతలుగా వ్యవహరించారు. రాత్రి స్వామి అమ్మవార్ల నగరోత్సవాన్ని వైభవంగా జరిపారు. స్వర్ణముఖి నది ఒడ్డున ఉన్న ప్రసూనాంబ సమేత నీలకంఠేశ్వరస్వామి, తిమ్మాజి కండ్రిగ సమీపంలో ఉన్న దర్గా మల్లేశ్వరి దేవి ఆలయాల్లో ప్రత్యేక హోమాలు చేశారు. రాత్రి గ్రామోత్సవాన్ని చేపట్టారు.

నాగేశ్వర స్వామి ఆలయంలో..

సూళ్లూరుపేట : స్థానిక నాగేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న పాంచాహ్నిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి ఆది దంపతుల కల్యాణాన్ని కనులపండువగా చేపట్టారు. ఆలయ చైర్మన్, ఉభయదారులు చెన్నారెడ్డి సుబ్రమణ్యస్వామిరెడ్డి, ఉషారాణి దంపతులు సారె సమర్పించారు. దేవుడి పెళ్లి సందర్భంగా చాలా జంటలు వివాహాలు చేసుకున్నాయి. వారికి పట్టువస్త్రాలు, తాళిబొట్టును స్వామిరెడ్డి గ్రామ పెద్దలు అందజేశారు. ఈవో కొడిముడి మమత, ప్రధాన అర్చకులు పేటేటి సునీల్‌కుమార్‌శర్మ, పాలక మండలి సభ్యులు కొండూరు వెంకటేశ్వర్లు, గుండాల భువనేశ్వరి, వంకా చంద్రశేఖర్, వేనాటి తిరుపాలమ్మ, ఒంటెల చెంగమ్మ, రుద్రపాటి సూర్యనారాయణ పాల్గొన్నారు.

వెంకటగిరిలో..

వెంకటగిరి రూరల్ : స్థానిక రామలింగేశ్వరస్వామి ఆలయంలో శనివారం రాత్రి శివపార్వతుల కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. అంతకు ముందు స్వామి, అమ్మవారిని నంది వాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయంలో భక్తులకు అన్నదానం చేశారు.

పేదలకు అన్నదానం

కోట : శివరాత్రి వేడుకల్లో భాగంగా శనివారం కోట తూర్పువీధిలోని సోమేశ్వరాలయంలో శివ సేవా సంఘం ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. రాత్రి పల్లకి ఉత్సవం నిర్వహించారు.

గ్రామోత్సవం

సైదాపురం : శివరాత్రి వేడుకల సందర్భంగా శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు గాండ్ల సంఘం ఆధ్వర్యంలో సైదాపురంలో పరమశివుని ఉత్సవ మూర్తులకు గ్రామోత్సవం నిర్వహించారు. అలాగే తురిమెర్లలో గ్రామోత్సవం చేశారు.

బైక్‌ను ఢీకొన్న ప్రైవేటు బస్సు



చికిత్స పొందుతున్న కండక్టర్ వెంకటేశ్వర్లు

వెంకటగిరి రూరల్ : శ్రీకాళహస్తి రూరల్ మండలం జగ్గరాజుపల్లి వద్ద వెంకటగిరి–తిరుపతి రోడ్డులో శనివారం రాత్రి బైక్‌ను ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఢీకొంది. దీంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల కథనం మేరకు.. బుచ్చినాయుడుకండ్రిగ హరిజనవాడకు చెందిన వెంకటేశ్వర్లు సత్యవేడు ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్నాడు. ఆయన శనివారం సొంత పని నిమిత్తం బైక్‌లో వెంకటగిరి వచ్చి తిరిగి మరో మహిళతో కలిసి స్వగ్రామం బయలుదేరాడు. జగ్గరాజుపల్లి వద్ద తిరుపతి నుంచి వెంకటగిరి వైపు వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఎదురుగా వస్తున్న మరో వాహనాన్ని తప్పించబోయి బైక్‌ను ఢీకొంది. దీంతో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. వారిని స్థానికులు 108లో వెంకటగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం తిరుపతి తీసుకెళ్లారు.

అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లండి



కొత్తపట్నంలో మేము సిద్ధం, మా బూత్ సిద్ధం కార్యక్రమం

కోట: మండలంలో ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పలగాటి సంపత్‌కుమార్‌రెడ్డి కోరారు. ఆయన శనివారం కొత్తపట్నం, కర్లపూడి సచివాలయాల పరిధిలో మేము సిద్ధం, మా బూత్ సిద్ధం కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్టీ నాయకులు, గృహసారథులు, వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు సమాయత్తం చేయడంలో భాగంగా ప్రతి ఓటరును కలిసి ప్రభుత్వం చేసిన సంక్షేమం, అభివృద్ధిని వివరించాలన్నారు. ఒక్కో సచివాలయం పరిధిలో ఎంత మేర అభివృద్ధి పనులు చేపట్టింది గణాంకాలతో సహా ప్రజలకు వివరించాలన్నారు. మనమంతా సైనికుల్లా పనిచేసి మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల కన్వీనర్ మొబీన్‌బాషా, సర్పంచ్ తిరుపాలయ్య, ఉపసర్పంచ్ ప్రసాద్‌గౌడ్ పాల్గొన్నారు.

డీవోఎస్ కాలనీలో చోరీ

సూళ్లూరుపేట : పట్టణంలోని డీవోఎస్ కాలనీలోని జనార్థన్ ఇంట్లో శుక్రవారం అర్ధరాత్రి దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఎస్‌ఐ రహీంరెడ్డి అక్కడికి వెళ్లి పరిశీలించారు. బాధితులు ఇంట్లో లేకపోవడంతో ఏమేమి వస్తువులు చోరీకి గురయ్యాయనే విషయం తెలియడం లేదని, వారు వచ్చిన తర్వాత కేసు నమోదు చేస్తామన్నారు.

గూడూరుకు చేరుకున్న కేంద్ర బలగాలు



కేంద్ర బలగాలతో గూడూరు పట్టణంలో కవాతు చేస్తున్న సీఐ పాపారావు

గూడూరు రూరల్ : త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికావద్దని సీఐ పాపారావు తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో గూడూరుకు చేరుకున్న కేంద్ర బలగాలతో శనివారం పట్టణంలో పోలీసు కవాతు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు అన్ని చర్యలూ తీసుకుంటున్నామని తెలిపారు. ఇప్పటికే పాత నేరస్తులను బైండోవర్ చేసినట్టు తెలిపారు. ప్రజలు ఎలాంటి ఆందోళన చెందకుండా నిర్భయంగా, స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

చెస్ పోటీల్లో చిన్నారి ప్రతిభ



వెంకటగిరి(సైదాపురం) : ఏపీ స్టేట్ చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెల్లూరులో గ్రీన్స్ ఫోర్స్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన ఆల్ ఇండియా ఓపెన్ చెస్ టోర్నమెంట్‌లో వెంకటగిరికి చెందిన మధుశ్రీతన్ ప్రతిభ చూపినట్టు వినయ్ చెస్ అకాడమీ అధినేత వినయ్ తెలిపారు. అండర్ -11 విభాగంలో మధుశ్రీతన్‌కు బాల ప్రతిభ పురస్కారం అందజేసి అభినందించారు.